# 113. నోటివరస

చాలాకాలం కిందటి సంగతి. రామనాథం అని, మా ఆఫీసులో నాతోబాటు పనిచేస్తూ ఉండేవాడు. ఓ వంద రూపాయలు అప్పు ఇమ్మని నన్ను అడిగాడు. "అయ్యో, సమయానికి నా దగ్గర లేకపోయిందే" అని నొచ్చుకున్నాను. "నువ్వు తల్చుకుంటే ఇవ్వలేకపోతావా ఏమిటి?" అన్నాడు. "తల్చుకున్నంత మాత్రాన్ని ఉన్నట్టుండి నా దగ్గర నీకివ్వడం కోసం నూరు రూపాయలు ఎలా చేరుతాయి!" అన్నాను. "రేపు ఈపాటి వేళకి నీ దగ్గర రెండు వందలు చేరుతే అప్పుడేమంటావు?" అన్నాడు. "అలా అయితే ఇవ్వగలనేమో...!" అన్నాను. ఆ సాయంకాలం ఇంటికి వెళిపోతూవుండగా "ఒరే, నువ్వు రేపు సెలవు పెట్టకు. రేపు నీ టి.ఏ.బిల్లు కేష్ అవుతుంది. నాకు నువ్వు వంద రూపాయలు అప్పు ఇస్తున్నావు." అన్నాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. అంతకి రెండు నెలల కిందట నేను దాఖలు చేసిన టి.ఏ.బిల్లు సంగతి. సరే, రెండు వందల యాభై రూపాయలు వస్తుంది కదా, అందులో ఓ వంద రామనాథానికి ఇవ్వచ్చు కదా అనుకున్నాను. తీరా ఇంటికి వెళ్లి ఆ లెక్కా ఈ లెక్కా చూసుకుంటే, మర్నాడు నాకు రెండు వందల యాభై రూపాయలు వచ్చినా సరే రామనాథానికి వంద రూపాయలు ఇవ్వలేనని తేలింది. మర్నాడు ఆఫీసుకి వెళ్లి, డబ్బు తీసుకున్నాను. అప్పటికింకా రామనాథం ఆఫీసుకి రాలేదు. మాట మీద మాటొచ్చి సుబ్బారావుతో అన్నాను, "డబ్బు రావడమైతే వచ్చింది గాని ఇందులో వంద రూపాయలు రామనాథానికి ఇచ్చేస్తే నాకు ఇబ్బందే. అంచేత వాడికి సారీ చెప్పేస్తాను". ఆ మాట విని సుబ్బారావు "అలా చెయ్యలేవు. వాడు నోరుపెట్టుకు పడిపోతాడు!" అన్నాడు.

అన్నంతపనీ అయింది. "ఒరే, నీకిప్పుడు వంద రూపాయలు అప్పిస్తే నాకు ఇబ్బందిరా" అన్నానో లేదో, రామనాథం నామీద విరుచుకుపడ్డాడు. రెండు నెలల నుంచీ అతీగతీ లేకుండా పడివున్న నా టి.ఏ.బిల్లు ఇవాళ కేష్ అవడం కోసం వాడు అడ్డమైన కాళ్లూ ఎలా పట్టుకున్నాడో చెప్పేడు. మాట ఇచ్చి నిలబెట్టుకోకుండా తప్పించుకుందికి ప్రయత్నిస్తున్న నేను ఎంత కృతఘ్నుడినో వర్ణించి చెప్పేడు. ఆఫీసులో అందరూ పన్లు మానేసి రామనాథం ఉపన్యాసం వింటూ కూచున్నారు.

"నోరు పెట్టుకు పడిపోతాడు" నుడికారం ఎలా వచ్చిందో నాకు అర్థమైంది.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది - అన్నారు. సామ, దాన, భేద దండోపాయాల్లో మొదటిది 'సామ'-అనగా మంచి మాట లాడి పని జరుపుకోడం - అందువల్లనే ఆ నుడికారం పుట్టి వుంటుంది.

"పెదవి దాటితే పృథివి దాటుతుంది" అనే సామెతను "నోరు దాటితే ఊరు దాటుతుంది" అని 'నోరు' పరంగా (పోనీ నోరారా) పునర్ వచించవచ్చు. "వాడి నోట్లో నువ్వుగింజ నానదు" అని నోరుపారేసుకునే వాడి గురించి చెప్పేరు. మనసు పారేసుకున్నా ప్రమాదం లేదుగాని నోరు పారేసుకుంటే కష్టం అని కొత్తసామెత చెయ్యొచ్చు. "నోరా, వీపుకి తేవే - అన్నారుట" అని ఉత్తరాంధ్రలో వాడుక. ఇదీ నోరు పారేసుకోడం మీద వచ్చిన నుడికారమే. అవసరానికి మించి మాట్లాడితే - అనగా నోరు పారేసుకుంటే - "వీపు సాఫయిపోతుంది" అనీ, "వీపు విమానం మోత మోగుతుంది" అనీ - ఆయా ప్రాంతాలను బట్టి భాష్యం చెప్పుకోవచ్చుట.

అనగా అనగా ఓ పాశ్చాత్య దేశంలో ఓ తండ్రీ కూతురూ ప్రయాణం చేస్తున్న రైలు

మార్గమధ్యంలో బందిపోట్ల దాడికి గురైందిట. టిక్కెట్లు తప్ప మిగిలిన డబ్బూ దస్కం సామానూ వస్తువులూ అన్నీ దోచుకున్నారుట. దొంగలు వెళ్ళిపోయాక ఆ తండ్రి - "అయ్యో, ఊరుకాని ఊరు వెళ్తున్నామే. చేతిలో డబ్బు లేకుండా అయిందే" అని నెత్తి (నోరు కూడా) మొత్తుకున్నాట్ట. అప్పుడా కూతురు "ఫరవాలేదు నాన్నా; నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది" అందిట. "అదెలాగ?" అన్నాట తండ్రి. "వాళ్లు అవీ ఇవీ దోచుకుంటున్న సమయంలో నేను మన వజ్రాల నెక్లెసుని నా నోట్లో దాచేసాను. ఆ వూరు వెళ్లగానే ఇది అమ్మేసుకుంటే బోలెడు డబ్బు వస్తుంది. అందుకే, నోరుంటే తలకాస్తుంది అన్నారు" అని చెప్పిందిట. అప్పుడా తండ్రి "అయ్యో, మనతోబాటు మీ అమ్మకూడా వచ్చుంటే మనీపర్స్ మొత్తం దాచివుండేది కదా!" అని పశ్చాత్తాప పడ్డాడట - ఈ కథ ఒక ఫారిన్ రిటండ్ తెలుగూరైటర్ చెప్పేరు.

నోరు పెద్దదుంటే మంచిదా, చిన్నదుంటే మంచిదా; అనే విషయం మీద ఓసారి వెంపరాల సూర్యనారాయణశాస్త్రి గారు చెప్పిన సంగతి గుర్తు చేసుకోవాలి. "సిరికింజెప్పడు శంఖచక్ర యుగమున్‌చేదోయి సంధింపడు" అన్న భాగవత పద్యాన్ని బోధపరుస్తూ "ఆకర్ణికాంతర ధమ్మిల్లము చక్కనొత్తడు" అనే దానికి అర్థం చెప్తున్నారన్నమాట. అప్పుడు ఓ కుర్రాడు లేచి, "మాష్టారూ, తాంబూలం తాలూకు ఉమ్మిరసం చెవిదాకా వ్యాపించిందన్నారు కదా, విష్ణుమూర్తి గారి నోరు అంతపెద్దదాండీ?" అని అడిగేడు. శాస్త్రిగారిచ్చిన వివరణ రెండు భాగాలు. ఒకటి చతుర్దశ భువనాలూ ఆయన నోట్లో ఉంటాయి కాబట్టి నోరు ఎంత పెద్దదని చెప్పుకున్నా ఇబ్బంది లేదు. రెండు: ఆయన ఆదిశేషువు పాన్పుమీద సాధారణంగా ఏటవాలుగా పడుకుని ఉంటారు కాబట్టి, తాంబూలం తాలూకు ఉమ్మిరసం నోట్లోంచి జారి చెంపల మీదుగా చెవిదాకా వ్యాపించి ఉండవచ్చు. "అయితేనూ; మీరంతా ఈ ఏడాది పరీక్షలు రాసీగానే మీ తల్లిదండ్రులు మీకు పెళ్లిళ్లు చెయ్యాలని ఆలోచించి మిమ్మల్ని పెళ్లి చూపులకని అక్కడికీ యిక్కడికీ తీసుకెళ్తారు కదా. అప్పుడు పిల్లల్ని చూసేటప్పుడు అక్కడా యిక్కడా చూస్తూ కూచోక నోరు సైజు మాత్రం జాగర్తగా గమనించుకోండి; ఎందుకయినా మంచిది!" అని కూడా అన్నారుట, శాస్త్రిగారు.

కాలు జారినా ఫర్వాలేదు గాని నోరు జారితే కష్టం అని ఇంకోటి వుంది. పెళ్లి చూపుల కోసం అబ్బాయి తరపువారు అమ్మాయి తరపువారింటికి వెళ్లి ముందు హాల్లో కూర్చున్నారుట. కొంత సేపటికి అమ్మాయి తల్లి అమ్మాయిని నడిపించుకొని వచ్చిందిట. "అదేమిటి, అమ్మాయి కుంటుకుంటూ నడుస్తోంది?" అని మొగపెళ్లి వారు అడిగేరుట. దానికి జవాబుగా పెళ్లికూతురి తండ్రి "రాత్రి అనుకోని పరిస్థితుల్లో అమ్మాయి కాలు జారింది. అని చెప్పడం వల్ల సంబంధం తప్పిపోయింది. మొగపెళ్లి వారు వెళ్లేక ఇల్లాలు "అదేంటండీ అలా చెప్పేరు? అమ్మాయి బాత్‌రూమ్‌లో పడ్డాది అని చెప్పొచ్చు కదా!" అందిట. కాలు జారడానికిగాని నోరు జారడానికి గాని మొగవాళ్లు సిద్ధపడినంత త్వరగా ఆడవాళ్లు సిద్ధపడరని గ్రహించాలి.

రాజకీయాల్లో ఉన్నవాళ్ళకి కాలుజారడమే ఎక్కువ ప్రమాదం. ఎందుకంటే వాళ్లు ఎన్నికలకి ముందుగాని ఆ తరువాత గాని జారేది నోరే. కాలు జారితే మాత్రం శంకుస్థాపనలూ, ఆవిష్కరణలూ, ప్రారంభోత్సవాలూ, వాగ్దానాలూ వంటివి (వారి విధులు) నిర్వర్తించలేక పోతారు. దేశ ప్రగతి (కాలుజారడం వల్ల) కుంటుపడిపోతుంది. ★